క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. అలాగే సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం లేని వారు, మద్యం సేవించి, అతిజోరుగా వాహనాలు నడపడం, హెచ్చరికలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. మైనర్లకు వాహనలు ఇవ్వరాదని కోరారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు సిబ్బంది, వాహన యజమానులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలి


పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లను వారి ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు ఆదేశించారు. శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిత పింఛన్ల యాప్ మొరాయించడంతో కొంత జాప్యం జరిగిందని, తరువాత పంపిణీ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సంతాపం

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పెద్దింటి శివాజీ మృతి తీరని లోటని హెచ్‌ఎం శంకరరావు, సహోపాధ్యాయులు పేర్కొన్నారు. శివాజీ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పరామర్శించి తమ సంతాపం తెలిపారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఇందు

సాలూరు: రాష్ట్రంలో నిత్యావసర సరకులు ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కమిటి సభ్యురాలు ఇందు డిమాండ్ చేసారు. పట్టణంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో పప్పులు, నూనె, కూరగాయలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరకుల ధరలకు రెక్కలొచ్చాయన్నారు. ధరలు మూడు రెట్లు పెరిగాయన్నారు. దీని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్ ఉచితమని చెబుతున్న ప్రభుత్వం దానిపై వందేందుకు సరుకులు కొనుగోలు చేసే శక్తి లేకుండా ప్రజలను బాధిస్తుందన్నారు. పట్టణంలో రైతుబజారును అందుబాటులోకి తీసుకువచ్చి సబ్సిడీపై ప్రజలకు నిత్యావసరాలను అందజేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గుడులు, బడులు, మెయిన్‌రోడ్డు దగ్గర్లో ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఐద్వా నాయకులు స్వప్న, సీత తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


బళ్లకృష్ణాపురంలో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. వర్ష సూచన ఉండడంతో పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన అనంతరం బళ్లకృష్ణాపురంలో సర్పంచ్ బళ్ల జగన్నాథం ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం బగ్గందొరవలస, తామరఖండి గ్రామాల్లో పనులను కూడా పరిశీలించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పనులను పర్యవేక్షించారు.

- జాడలేని 'అన్నదాత సుఖీభవ'
- ఖరీఫ్ పూర్తి కావస్తున్నా.. అందని సాయం
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అందిన సాయం

రైతు నోట మట్టి


ఖరీఫ్ సీజన్‌లో వరి పంట


కెఎస్.పురం పొలాల్లో వరిచేను కుప్పలు

బలిజిపేట: ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రారంభమైన వరి పంట కోతలు కొద్ది రోజుల్లోనే పూర్తి కానున్నాయి. రబీ సీజన్ కూడా ప్రారంభం కానుంది. వరి కోతలు పూర్తయి విక్రయాలకు రైతులు సిద్ధమవుతున్నా... కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకం జాడ ఇప్పటికీ కానరావడం లేదు. కూటమి పాలకులు ఆ ఊసెత్తడం లేదు. ఖరీఫ్‌లో పెట్టుబడి సాయం అందక అప్పులు చేసి మదుపులు పెట్టిన అన్నదాతకు వర్షాలు కూడా అనుకూలించలేదు. వచ్చిన దిగుబడులు పెట్టుబడుల అప్పులు తీర్చడానికే సరిపోయినట్టు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జూన్ నెలలోనే రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయం అందేదని...నవంబరు వచ్చి ఖరీఫ్ పూర్తి కావస్తున్నా...నేటికీ అన్నదాత సుఖీభవ పథకం సాయం అందించకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమ నోట మట్టి కొట్టిందని వారు ఆవేదన చెందుతున్నారు. 2019 – 24 మధ్య కాలంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతుకు క్రమం తప్పకుండా రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం కింద మొత్తంగా రూ.13,500 అందేది. దీనిలో ఖరీఫ్ ప్రారంభంలో రూ.7,500, ఆగస్టు నెలలో రూ.2,000, అక్టోబరు నెలలో రూ.2,000, జనవరిలో రూ.2,000లు అందేవి. గతంలో బలిజిపేట మండలంలో 9,194మంది రైతులకు రైతు భరోసా అందేది. ప్రస్తుత ఖరీఫ్‌లో సుమారు 10వేల మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ పేరుతో అందిస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, గోగు, అరటి, మామిడి, జీడి, కూరగాయల పంటలు పండిస్తారు. ఈ పంటలు పండించే రైతుకు అన్నదాత సుఖీభవ పేరుతో ఆర్థిక సాయం అందించాల్సి ఉన్నప్పటికి నేటికి అందలేదని వాపోతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, పురుగు మందులు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియపరిచేవారు.

సాయం అందక...



ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ పథకంలో రైతుకు పెట్టుబడి సాయం అందించి ఉంటే రైతు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండేది. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఆర్థిక సాయం ఖచ్చితంగా అమలు జరిగేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయలేదు.

– ఎ.పారినాయుడు, రైతు, పి.చాకరాపల్లి గ్రామం, బలిజిపేట మండలం

అప్పుల పాలు..

ఖరీఫ్‌లో వరి సాగు చేసిన సన్న, చిన్నకారు రైతులు వడ్డీలకు పెట్టుబడి మదుపులు తెచ్చి మరీ సాగు చేశారు. అన్నదాత సుఖీభవ అందుతుందన్న ఆశతో ఇన్నాళ్లు వేచి చూసిన రైతులకు ఇప్పుడు ఆ నమ్మకం సన్నగిల్లింది. దీంతో తాము చేసిన అప్పులు ఎలా తీర్చేదని వారు నిర్వేదం చెందుతున్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లతో మరింత భారం పడిందని, ఈ అప్పులు ఎలా తీర్చేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు యశోదమ్మ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లికి చెందిన సర్లింగి యశోదమ్మ గత నెల 30న పార్వతీపురంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సివిల్ సర్వీసెస్ మహిళల 35 సంవత్సరాల పైబడిన విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. యశోదమ్మ ప్రస్తుతం కందులపదం సచివాలయంలో హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్నారు.

ఈ నెల 6 నుంచి 9 వరకు విజయవాడలోని దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో మన్యం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు తెలిపారు.

'భోజన' నిర్వాహకులపై రాజకీయ కక్ష


అరసాడ ఉన్నత పాఠశాల వద్ద భోజన నిర్వాహకులతో సీఐటీయూ నాయకులు

బలిజిపేట: అరసాడ ఉన్నత పాఠశాలలో 22 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులుగా పని చేస్తున్న వారిని రాజకీయంగా, కులం పేరుతో దూషించి ఇద్దరు హెల్పర్లను, ఒక నైట్ వాచ్‌మన్‌ను తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు, రాష్ట్ర ఐద్వా అధ్యక్షురాలు ఇందిర పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన వారు కాదని ఒకే ఒక్క కారణంతో గిరిజన, రజక కులాలకు చెందిన వారని, తక్కువ కులాల వారు వండితే తమ బిడ్డలు ఎందుకు తినాలని రాజకీయ వేధింపులకు గురి చేసి తప్పుడు తీర్మానాలు ప్రవేశపెట్టి తొలగించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. భోజనం బాగాలేకపోతే మందలించి బాగా వండించాలని, అంతేగాని తొలగించి తమకు నచ్చిన వారిని ఎలా పెట్టుకుంటారని నిలదీశారు. పాఠశాల హెచ్‌ఎం కూటమి నేతలు చెప్పిన విధంగా చేస్తూ వారికి కొమ్ముకాయడం సరి కాదని పేర్కొన్నారు. తొలగించిన వారికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎంఈఓ సింహాచలంకు వినతిపత్రం అందజేశారు.

పురంలో వెలుగుల పండగ



దీపావళి పండగ పార్వతీపురంలో గురువారం సాంప్రదాయబద్ధంగా జరిపారు. వీధులన్నీ పటాసుల శబ్దాలతో మార్మోగాయి. పిల్లలతో పోటీ పడి పెద్దలు బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. పురంలోని ఇళ్ల ముందు రంగవల్లులు వేసి మహిళలు సందడి చేశారు. రంగురంగుల టపాసులను కాల్చుతూ చిన్నారులు సందడి చేశారు.

– పార్వతీపురం టౌన్

నిరీక్షణ

మండలంలోని పలు సచివాలయాల్లో శుక్రవారం ఉదయం సర్వర్లు మొరాయించడంతో సచివాలయ ఉద్యోగులు, పింఛన్‌దారులు అలా నిరీక్షించారు. ఉద్యోగులు పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేసేందుకు అంతా సిద్ధం చేసుకున్నా... ఉదయం 10.30 గంటల వరకు సర్వర్లు పని చేయకపోవడంతో సకాలంలో పింఛన్లు అందించలేకపోయారు. ఇదే సమయంలో జోగింపేట, సూరంపేట గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పరిశీలనకు వెళ్లిన ఎంఈఓ సూరిదేములు మాట్లాడుతూ యాప్ పని చేసిన వెంటనే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని సూచించామని తెలిపారు. ఈ చిత్రం జోగింపేట సచివాలయంలో సర్వర్ పని చేయక వేచి ఉన్న సచివాలయ ఉద్యోగులు. – సీతానగరం



భయపెడుతున్న గజరాజులు



దిబ్బగుడ్డివలసలో గజరాజులు సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్వతీపురం మండలంలోని సంగంవలస, దిబ్బగుడ్డివలస, పెదబోండపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు. సాయంత్రం వేళ అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావొద్దని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో రావాల్సి వస్తే...నలుగురైదుగురు కలిసి వచ్చి వెళ్లాలని కోరారు.

– పార్వతీపురం టౌన్

వరి కోతల్లో రైతుల బిజీ


కృష్ణారాయపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ


కెఎస్.పురం పొలాల్లో వరిచేను కుప్పలు

సీతానగరం: మండలంలో వరి పంట కోతకు వచ్చింది. దీంతో రైతులు కోత పనుల్లో బిజీగా ఉన్నారు. కోత యంత్రాలతో నూర్పిడి పనులు చేపట్టారు. కేఎస్‌పురం, దయానిధిపురం, సుమిత్రాపురం, పెదంకలాం తదితర గ్రామాల్లో కోసిన వరి చేలు కుప్పలు పెడుతున్నారు. కొందరు రైతులు యంత్రాలతో కోసిన చేలను నూర్పిళ్లు కూడా చేపట్టారు. మరికొందరు కళ్లాల్లోనే పంటను విక్రయించేస్తున్నారు. కృష్ణారాయపురంలో వరి పొలంలోనే యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యం బస్తాలను ఏఓ ఎస్.అవనాష్ పరిశీలించారు. మండలంలో మూడు వేల ఎకరాల్లో పంట చేను కోత పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే విద్యా ప్రమాణాలు మెరుగు

- జిల్లా ఇండస్ట్రీయల్ మేనేజర్ కరుణాకర్


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

సీతానగరం: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యా స్థాయిని పెంచుతూ టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఇండస్ట్రీయల్ మేనేజర్ కరుణాకర్ అన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధనలు, విద్యార్థులకు అవసరమైన వసతులను ఎంపీడీఓతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషితోనే విద్యా ప్రమాణాలు మెరుగవుతాయని అన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భోజన పథకం సరిగా అమలు చేయాలని సూచించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి బడిదేవర కొండ పరిరక్షణకు పాదయాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండకు ఇచ్చిన తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కొండ రక్షణ పోరాట కమిటీ నాయకుడు, సీపీఎం నేత ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి బడిదేవర కొండ పరిరక్షణకు పాదయాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు. నవంబరు 6న పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిసి కొండపై తవ్వకాలు ఆపాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు బి.దాసు, బి.అప్పలనాయుడు, సీపీఐ నాయకులు టి.జీవ, గిరజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్‌కుమార్, ఏఐటీయూసీ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.సంగం, సూరయ్య తదితరులు ఉన్నారు.

మరో గిరిజన పోరాటం తప్పదు



వర్ధంతి సభలో పాల్గొన్న గిరిజనులు

పార్వతీపురం టౌన్:

గిరిజన హక్కుల కోసం మరో పోరాటం తప్పదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మొట్టమొదటి గిరిజన పోరాట అమరులు కొరన్న, మంగన్నల వర్ధంతి సభ పార్వతీపురం మండలం కొత్తవూరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అడవి నుండి గిరిజనులను తరిమేసే కుట్ర జరుగుతుందన్నారు. ఐటీడీఏ, జీసీసీ, 1/70, పీసా చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. జీఓ నెంబర్ 3 రద్దు చేసి గిరిజన యువతకు ఉపాధ్యాయ ఉద్యోగం రాకుండా చేసారన్నారు.

ఐటీడీఏకు రెగ్యులర్ పీఓ, డీడీ లేరని, పాలకవర్గ సమావేశాలు జరపడం లేదన్నారు. గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు బొండపల్లి జనార్దన్, హిమరక భాస్కరరావు, హిమరక సింహాచలం, నరేష్, నూకమ్మ, సుధా, గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేమని పలువురు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పలువురు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఆయన త్యాగాలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు నేటి తరం పాటుపడాలని పిలుపునిచ్చారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


పార్వతీపురం టౌన్: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, తదితరులు


సాలూరు: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


బలిజిపేట: పెదపెంకిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు


సాలూరు/రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

డీబీటీ ద్వారా దీపం నగదు బదిలీ

సాలూరు: దీపం పథకం లబ్ధిదారులకు సొమ్ములను డీబీటీ ద్వారా జమ చేయడం జరుగుతుందని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దీపం పథకంలో భాగంగా లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ బుకింగ్ చేసి గ్యాస్ సొమ్ములు ఏజెన్సీ వారికి మొదట చెల్లించాలని, అనంతరం అర్హులైన లబ్ధిదారుల మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ వచ్చిన లబ్ధిదారులకు గ్యాస్ ఏజెన్సీకు చెల్లించిన మొత్తం పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పలువురు అధికారులు పాల్గొన్నారు.